# పదవికి ముప్పు

విశాలమైన, అధునాతనమైన ఆ హాలులో వాతావరణం గంభీరంగా వుంది. అందంగా అమర్చిన సోఫాల్లో సుమారు ఇరవై మంది కూర్చుని వున్నారు. అందరూ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, వారి వారి భార్యలు, భర్తలు, పిల్లలు. అదొక సంపన్నమైన పెద్ద కుటుంబం. అయితే ఈ మధ్యకాలంలో ఇలా అందరూ ఒక చోట చేరి సమాలోచనలు చేసిన సందర్భాలు లేవు.

అసలు సంగతేమంటే, డెబ్బై ఏళ్ళు పైబడిన వాళ్ళ తండ్రిగారికి అనుకోని విధంగా పెద్ద మంత్రిపదవి వరించి వచ్చి కూర్చుంది. నిజానికది వారు ఊహించినదీ కాదు, వారి తండ్రిగారు ఆశించినదీ కాదు.

ఎప్పుడైతే ఆయన పెద్ద పదవిని స్వీకరించారో సామాన్యులుగా వారి వారి వ్యాపార వ్యవహారాలతో బతుకుతున్న ఆయన కుటుంబ సభ్యుల కందరికీ సెక్యూరిటీ ఏర్పాటయింది. వారందరి పరపతి ఒక్కసారిగా పెరిగిపోయింది. వెంటనే ఆ తండ్రిగారు తన కుటుంబ సభ్యుల దగ్గరికి తన ఆంతరంగిక కార్యదర్శిని పంపించారు. నిస్వార్థమైన తన దేశసేవకి తన కుటుంబ సభ్యుల చర్యలు అడ్డు రాకూడదని చెప్పి పంపారా? ఏమో ఏం చెప్పి పంపారో - తెలీదు. సన్నగా, పొట్టిగా, తెల్లగా వున్న అతను మంత్రిగారి దగ్గర పాతిక సంవత్సరాలుగా సెక్రటరీగా పనిచేస్తున్నాడు. మంత్రి పదవైతే ఆయనకిప్పుడొచ్చిందిగానీ, సామాన్య లోక్‌సభ సభ్యుడిగా వున్నప్పటినుండీ ఆయనకి అతనే సెక్రటరీ.

మంత్రిగారి పెద్దకొడుకు ముందుగా గొంతు సవరించుకుని "సెక్రటరీగారూ, నాన్నగారు మీకేం చెప్పారో, మీరు ఏం చెప్పదలచుకున్నారో, నాకు తెలీదుగానీ ముందు మేము చెప్పేది వినండి" అంటూ మొదలుపెట్టాడు.

"నేను కార్ల కంపెనీ ఏజన్సీ ఇరవై ఏళ్ళుగా చేస్తున్నాను. దీనికి నాన్నగారి మంత్రిపదవికీ ...."

"అబ్బే ! అలాంటిదేమీలేదు. మీరాయన పరపతి ఉపయోగించుకుని లాభాలు పొందినా ఆయనకేం ఫర్లేదండి" సవినయంగా అన్నాడు సెక్రటరీ.

"నేను మా ఊళ్ళో మా భూములు చూసుకుంటూ ధాన్యం వ్యాపారం చేసుకుంటున్నాను. నాకిప్పుడు మూడు వందల ఎకరాల భూమి వుంది. నాలుగు రైస్ మిల్లులున్నాయి" అన్నాడు రెండో కుమారుడు.

"దానిదేముందండీ. అదేం ఫరవాలేదు. ఇది ముందు నుంచీ వున్నదేగా" అన్నాడు మరింత వినయంగా. చిట్‌ఫండ్ కంపెనీలు, ఫైవ్‌స్టార్ హోటల్స్ చెప్పుల వ్యాపారం నుండి చేపల వ్యాపారం వరకు ఒక్కొక్కరూ వారి వారి వ్యాపారాలు, వాటి వివరాలు చెప్పారు తమ ప్రవర్తనవల్ల తమ తండ్రిగారి మంత్రి పదవికిగాని, పరపతికిగానీ భంగం రాకుండా చూసుకుంటామన్నారు.

కూతుళ్ళూ, అల్లుళ్ళూ, మనవలు, అందరూ అదే మాట -

అందరికీ సెక్రటరీ అదే భరోసా, మరేం ఫరవాలేదని. ఇంతలో ఆఖరి కొడుక్కి చిరాగ్గా అనిపించిందేమో చిటిక లేసుకుంటూ లేచి, తలుపు తీసుకుని బయటకెళ్ళిపోయాడు.

అప్పుడు సెక్రటరీ లేచి "మీరంతా చెప్పింది బాగుంది. మీ గురించి మాకేమీ ఫిర్యాదులూ లేవు. మీవల్ల నాన్నగారి పదవికి భంగం కలుగుతుందనే భయమూ లేదు కానీ ...." ఆగాడు.

"కానీ ఏమిటి ? చెప్పండి. ఏదైనా నిర్భయంగా చెప్పండి." అన్నాడు పెద్ద కొడుకు.

"అదే ...." అతను ఒక్క నిముషం నసిగాడు.

"చెప్పండి" అందరూ ముక్తకంఠంతో అన్నారు.

"నాన్నగారి పరపతి నుపయోగించి 'చిన్నా' టెలివిజన్‌లో లలిత సంగీతం పాడకుండా చూస్తే చాలు. నాన్నగారి మంత్రి పదవికి ఢోకా వుండదు." అంటూ సెక్రటరీ నెమ్మదిగా తేల్చాడు. 1-10-'93 (ఆంధ్రజ్యోతి)